క్లుప్తంగా

ముగిసిన పవిత్రోత్సవాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం గోపూజ, ద్రవ్యాంత పూజలు, హోమాలు, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, పవిత్ర జలసంప్రోక్షణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో పవిత్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారి మాసకల్యాణాన్ని జరిపించారు. పవిత్రోత్సవాలకు సంబంధించి అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం నాల్గవ శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామి, అమ్మ వార్లకు భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలయ ఈఓ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సాయిపురం దేవస్థానాల ఈఓ సాయిబాబు పాల్గొన్నారు.

ఉచిత తాగునీటి ట్యాంకర్ ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మండలంలోని ప్రజల అవసరాలు తీర్చేందుకు ఉచిత తాగునీటి ట్యాంకర్ ఏర్పాటుచేశారు. మండలంలోని ఏ గ్రామానికి చెందిన వారైనా ఎలాంటి కార్యక్రమాలకు అయినా ఉచితంగా ఈ తాగునీటి ట్యాంకర్‌ను ఉపయోగించుకోవచ్చని ఎంపీపీ తెలిపారు. ఈ ట్యాంకర్ ఈ నెల 18 నుంచి ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని చెప్పారు. తన సోదరుడు స్థానిక వేంకటేశ్వర ఆక్వాఫీడ్స్ అధినేత రామిశెట్టి ప్రసాద్ ఆర్థిక సాయంతో ఈ ట్యాంకర్ అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

గుడివాడ టౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండ శ్రీరాజబాబులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం. రామకృష్ణ, సూరే గాంధి, వై అర్జున్, కె. మురళి, బి. గోపి పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం బీజేపీ స్థానిక కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కోటప్రోలు కృష్ణ, సత్యవోలు నాగలక్ష్మీ, వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోశాలకు ఆవుల తరలింపు



కైకలూరు: రోడ్లుపై సంచరిస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్న 35 ఆవులు, ఆబోతులను గుంటూరు గోశాలకు తరలించినట్లు ఎంపీపీ అడవి కృష్ణ తెలిపారు. వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణతో కలసి రైతు బజారు ఎదురుగా బందుల దొడ్డి నుంచి పశువుల తరలింపు ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కై కలూరులో పశువుల యజమానులు విచక్షణరహితంగా రోడ్లుపైకి గోవులను వదిలేస్తోన్నారన్నారు. అవి ప్లాస్టిక్ వస్తువులు తింటూ అనారోగ్యంతో మరణిస్తున్నాయని తెలిపారు. కైకలూరులో మొత్తం 67 ఆవులు, 23 ఆబోతులు కలిపి మొత్తం 90 పశువులను బంధించారన్నారు. వీటిలో 55 పశువులను జరిమానాలు కట్టించుకుని మరోసారి రోడ్లపైకి వదలబోమని రాయించుకుని తిరిగి వారికి అప్పజెప్పామన్నారు. ఎవరూ ముందుకు రాని 35 ఆవులు, ఆంబోతులను గుంటూరులో గోశాలకు తరలించామని తెలిపారు.

జాతీయ రహదారిపై మురుగుతో ఇక్కట్లు

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో దుకాణాల ముందు జాతీయ రహదారిపై మురుగు నీరు నిలబడి దుర్వాసన వ్యాపిస్తూ సమస్యగా మారిందని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గంజాల శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రోడ్డును పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండవల్లిలో జరుగుతున్న పనులు ఆలస్యం కావడం, గ్రామం చివరి వరకు డ్రెయినేజీ సక్రమంగా నిర్మించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తుందన్నారు.

ఆక్రమణల తొలగింపు

కైకలూరు: ఉప్పుటేరు పరివాహక ప్రాంత ఆక్రమణలను ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ సమక్షంలో శనివారం తొలగించారు. ఇటీవల కొల్లేరు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆక్రమణలు, గుర్రపుడెక్క కారణమని కై కలూరు, ఉండి ఎమ్మెల్యేలు గుర్తించారు. కలెక్టర్ సైతం పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో యద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకున్నారు. పంట్లు సాయంతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగిస్తున్నామని ఆర్డీఓ చెప్పారు.

కొనసాగుతున్న బుడమేరు ఉద్ధృతి

పుట్టగుంట వంతెన వద్ద 17 అడుగులకు చేరిన నీటి మట్టం



పుట్టగుంట వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు డ్రెయిన్

గుడివాడరూరల్: విస్తారంగా కురిసిన వర్షాలకు బుడమేరు వరద ఉద్ధృతి యథావిధంగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద నీరు విస్తృతంగా వస్తుండటంతో పుట్టగుంట వంతెన వద్ద వరద నీటి ప్రవాహం 17 అడుగులకు చేరుకుంది. రోజుకు ఐదు వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో వరద పెరిగే అవకాశం ఉండటంతో పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అధికారులు పుట్టగుంట వంతెన వద్ద ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు భద్రతా చర్యలను అధికారులు చేపట్టారు. వంతెనపై వెళ్లే వాహనదారులకు తగు సూచనలు చేసి ప్రమాదం జరగకుండా నివారించేందుకు చర్యలు చేపట్టారు.

నీట మునిగిన పంట పొలాలు

బుడమేరు వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో పరిసర ప్రాంత గ్రామాలైన ఒద్దులమెరక, చేదుర్తిపాడు, చినలింగాల, పెదలింగాల, పుట్టగుంట, అరిపిరాల తదితర గ్రామాల్లో దాదాపుగా 1,000 ఎకరాల వరి పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే రైతులు నాట్లు వేసి రెండు దఫాలుగా ఎరువులను సైతం వేశారు. ఎకరాకు రూ.15వేలకు పైగా ఖర్చు చేశారు. వరదల వస్తున్న నీటికి పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది ఇదే సమయంలో చేతికి అంది వచ్చిన పంట పొలాలు బుడమేరు వరద ఉద్ధృతికి పూర్తిగా తుడుచుకుపోయాయి. రైతులు ఎకరాకు రూ.25వేలకు పైగా నష్టపోయారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అయినా కనీసం పంట చేతికి అందుతుందనుకున్న సమయంలో బుడమేరు వరద వలన పంట పొలాలు ముంపునకు గురి కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షాలు ఇదేవిధంగా కొనసాగితే పూర్తిగా నష్టపోయి అప్పులు పాలవుతామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రూరల్ మండలంలో..

గుడివాడరూరల్ మండలంలో వర్షాల దెబ్బకు పంట పొలాలు నీటమునిగాయి. చంద్రయ్య డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుండటం, గుడివాడ చానల్‌కు వరద నీరు ఎగువ నుంచి వస్తుండటంతో పరివాహక ప్రాంత గ్రామాలైన తటివర్రు, రామనపూడి గ్రామాల్లో 300 ఎకరాలు నీట మునిగాయి. చానల్స్, డ్రెయిన్లలో గుర్రపుడెక్క మేట వేసుకుపోవటం వరద నీరు దిగువకు సక్రమంగా ప్రవహించకపోవడంతో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. సకాలంలో గుర్రపుడెక్క నిర్మూలన పనులు చేయకపోవడం వలనే ముంపునకు ప్రధాన కారణమని రైతన్నలు ఆరోపిస్తున్నారు. వరద నీరు సక్రమంగా దిగువకు వెళ్లేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.



గుడివాడ మండలం రామనపూడిలో నీట మునిగిన పంట పొలాలు

గౌతు లచ్చన్నకు నివాళులు



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

గుడివాడ టౌన్: సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీతివంతమైన రాజకీయాలకు, నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం గౌతులచ్చన్న అని కమిషనర్ పేర్కొన్నారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పదవిని తృణప్రాయంగా వదులుకున్న నాయకుడు గౌతు లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, ఏఓ నాయుడు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక గురజ రోడ్డులోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను శనివారం జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని బీసీ నాయకులు పలువురు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడిత ప్రజల అభ్యున్నతికి తుదిశ్వాస వరకు లచ్చన్న ఉద్యమించారని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పరసా కనకరావు, వీరమల్లు నరసింహారావు, ఈడే సుధాకర్, వీరంకి వెంకయ్య, శేషబాబు, దావు నాగరాజు, చంటి కుమారస్వామి పాల్గొన్నారు.



ముదినేపల్లిలో గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కౌతవరంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న విగ్రహానికి గ్రామ ప్రముఖులంతా పూల మాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి యుగంధర్, మాజీ అధ్యక్షులు బొబ్బా నరసింహారావు, బొబ్బా నరసింహారావు, గౌడ సంఘీయులు ఈడె కృష్ణారావు, పోతురాజు, నరసింహారావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా తాలూకా సెంటర్‌లో విగ్రహానికి నివాలుర్పించారు. నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పరసా ఏడుకొండలు, పైడిమర్రి మాల్యాద్రి, పెన్మెత్స త్రినాథ్ రాజు, కె.కె.బాబు, మంగినేని రామకృష్ణ, వీరాబత్తిన సుధ, పి.రాధకృష్ణ, పడమట వాసు, జానీ తదితరులు పాల్గొన్నారు.

జయ జనార్దనా కృష్ణ రాధికా పతే..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కైకలూరు శ్యామలాంబ దేవస్థాన ఆవరణ వేడుకల్లో పాల్గొన్న డీఎన్నార్



గుడివాడలో శ్రీకృష్ణుని ఊరేగిస్తున్న యాదవ ప్రముఖులు

గుడివాడ టౌన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుని విగ్రహం పూలతో అలంకరించిన రథంలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీకృష్ణ మందిరం నుంచి భారీ ఊరేగింపు బయలుదేరి నాగవరప్పాడు వంతెన, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, వాసవీచౌక్, ఏజీకే సెంటర్ మీదుగా తిరిగి ఏలూరు రోడ్డులోని కృష్ణ మందిరానికి ఊరేగింపు చేరింది. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్, యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు డొక్కు రాంబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, లోయ రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఆర్‌వీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రామాలయాలు, కృష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం ఉదయం నుంచే పలు గ్రామాల్లో భక్తులు కాలువల్లో స్నానాలు ఆచరించి గోవులను తోలుకుని ఊరేగింపు నిర్వహించారు. బాలురు, బాలికలు ఉత్సాహంతో శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అల్లూరు శ్రీకృష్ణ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ శీలం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పార్టీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, యర్రా శ్రీరాములు పాల్గొన్నారు. సాయంత్రం నుంచి పలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం తదితర గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ఘనంగా వేడుకలు జరిపారు. శ్రీ కృష్ణాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. అనంతరం పురవీధులలో స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో చేబోయిన వీర్రాజు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, నల్లిబోయిన రాజేష్, జాజుల వంశీకృష్ణ, ఆగొల్లు గంగారావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం కనులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, పవన్‌కుమార్ శ్రీకృష్ణుని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.



గుడ్లవల్లేరులో శ్రీ కృష్ణుడిగా భక్తులకు దర్శనమిచ్చిన సత్యదేవుడు

మొవ్వలో..

మొవ్వ: మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం అంబరాన్ని అంటాయి. కూచిపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కారకంపాడు, చినముత్తేవి తదితర గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించి ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని మధ్య నిర్వహించారు. యాదవ సంఘాల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

రాధాకృష్ణుల ఊరేగింపు

మండవల్లి: మండవల్లిలోని శ్రీ రామకృష్ణ మందిరంలో కొలువైన శ్రీ రాధాకృష్ణ ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు భక్తుల దర్శనార్థం పురవీధులలో శనివారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– అల్లినగరంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామివారి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని ఈఓ దివ్య పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు శనివారం నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: కృష్ణాష్టమి వేడుకను నియోజకవర్గంలో ఘనంగా శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కైకలూరు శ్యామలాంబ దేవస్థానం వద్ద శ్రీకృష్ణా యాదవ సంఘం ఏర్పాటు చేసిన మండపం, ఆటపాకలో శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మేదావుల ఫోరం కార్యదర్శి బీవీ.రావు కుటుంబ సమేతంగా కృష్ణాష్టమి పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మేధావుల విభాగ ప్రధాన కార్యదర్శి పంజా రామారావు, నాయకులు బూరుబోయిన మోహనరావు, ఉలిసి శ్రీనివాసరావు, కన్నా రమేష్, చొప్పాల రాము, సింగంశెట్టి లక్ష్మీనరసింహారావు, సిద్ధబత్తుల శ్రీరామమూర్తి, తామర్ల రామయ్య, రాము, ఆకుల వెంకటేష్ పాల్గొన్నారు.



మండవల్లిలో రాధాకృష్ణుల ఊరేగింపు

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, వానపాముల తదితర గ్రామాల్లో యాదవుల ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంట్రప్రగడలోని ఎర్ర చెరువు సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద యువత ఉట్టికొట్టే కార్యక్రమాన్ని జరుపుకున్నారు. పెదపారుపూడి శ్రీకృష్ణ మందిరం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.



వెంట్రప్రగడలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

వైభవంగా గ్రామోత్సవం

ముదినేపల్లి రూరల్ : రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథ స్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, ఇతర అర్చకులు శ్రీసుభద్ర, బలరామ సమేత జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను వాహనంపై తయారుచేసిన వేదికపైకి చేర్చి పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.



మండవల్లి కృష్ణాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



భట్లపెనుమర్రులో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



అల్లూరు శ్రీకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ, నాయకులు

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



గుడివాడ టౌన్: స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. జైభీమ్ వెల్ఫేర్ సొసైటీ, అంబేడ్కర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ దళితుల దశాబ్దాల కల ఈరోజు నెరవేరిందన్నారు. స్థానిక పామర్రు రోడ్‌లో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పనుల్లో భాగంగా కోతిబొమ్మ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాల్సి రావడంతో దానికి ప్రత్యామ్నాయంగా విగ్రహ ఏర్పాటు నెహ్రూచౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ గుడివాడకు విచ్చేసిన రోజు సెప్టెంబర్ 30వ తేదీ లోగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అంబేడ్కర్ అభిమాన సంఘాల నాయకులు, టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు, బౌద్ధగురువులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

మండవల్లి: మండవల్లి, పెరికెగూడెం గ్రామాల్లో కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ ఆధ్వర్యంలో మండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెరికెగూడెం, మండవల్లి గ్రామాల్లో శనివారం డ్రగ్స్ వద్దు బ్రో అనే అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎస్ఐ వి.రామచంద్రరావు మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.25 లక్షల విరాళం

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతలు రూ.1.25 లక్షల విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు శనివారం అందజేశారు. స్థానిక ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో టెన్త్ బ్యాచ్(1991–92) పూర్వ విద్యార్థులు ఈ విరాళాన్ని అందించినట్లు వెంకట్రావు పేర్కొన్నారు.

తాగునీరు కలుషితం

పట్టించుకోని అధికారులు

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు పంచాయతీ చెరువులోని కొన్ని నెలలుగా తాగునీరు కలుషితంగా మారినా పట్టించుకునే నాథుడే లేరు. పంచాయతీ చెరువులోని తాగునీరు అంతా పసరుగా మారి, దుర్వాసన వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. వాటర్ ట్యాంక్ ఫిల్టర్ల బెడ్‌లు సరిగా పని చేయకపోవటంతో తాగునీరు కలుషితంగా మారిందని తెలిపారు. ఆ నీటితో స్నానం చేస్తుంటే దురదలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అంటువ్యాధులు వచ్చే అవకాశం

గ్రామంలోని పంచాయతీ నీళ్లు చూస్తుంటే పచ్చగా ఉన్నాయి. ఈ నీరు తాగితే ఎక్కడ అంటువ్యాధుల బారిన పడతామోనని ఆ పంచాయతీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారికి ఈ విషయం తెలియజేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



పంచాయతీ చెరువులో కలుషిత నీటిని చూపుతున్న బోయిన శివయ్య

తాగునీరు లేక ఇబ్బందులు

గ్రామంలో ఉన్న పంచాయతీ చెరువులో తాగునీరు అంతా పసరుగా మారిన దుర్వాసన వస్తుంది. చేసేది లేక ప్రజలు ఆ నీటిని తాగితే రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి పుల్లారావుకు చెప్పినా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప సమస్య పరిష్కారం కావటం లేదు. మండల స్థాయి అధికారులు మా ఊరు మాత్రం రావు

– శ్రీనివాసరావు, మోపర్రు పంచాయతీ

నీరు సరిగా ఫిల్టర్ కావడం లేదు

పంచాయతీ చెరువులోని నీళ్లు సరిగా ఫిల్టర్ కావడం లేదు. దీంతో తాగునీరు కలుషితంగా ఉంటున్నాయి. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా డీఎల్‌పీఓ స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

– జూపల్లి వెంకట్రావు, మోపర్రు పంచాయతీ

భక్తిశ్రద్ధలతో గోపూజ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం గోపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ పర్యవేక్షణలో సిద్ధేంద్ర యోగికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని శివాలయ అర్చకుడు పెనుమూడి సతీష్ కుమార్‌శర్మ నిర్వహించారు. టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథశాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ నల్లగుళ్ల వెంకటేశ్వరరావు, గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపువెంకటేశ్వరఫణికుమార్ పాల్గొన్నారు.